క్లుప్తంగా

శానిటేషన్ పనులు



వాజేడు: మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామంలో ఆదివారం శానిటేషన్ పనులను చేపట్టారు. గ్రామంలోని మురుగు నీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేశారు. రహదారుల వెంట గడ్డి మందును పిచికారీ చేశారు. దోమల ఉధృతి తగ్గడానికి అవసరమైన చర్యలను ఏడ్జర్లపల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



రేగొండ: మండల పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కనుగొని అప్పగించినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు. మండలంలోని జూబ్లీనగర్ గ్రామానికి చెందిన ఐలు కొమురయ్య ఫోన్ పోయిందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ కనుగొని ఆదివారం కొమురయ్యకు అప్పగించినట్లు ఎస్సై వెల్లడించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కాటారం: యాదవుల సమస్యలు పరిష్కరించాలని యాదవ సంఘం నాయకుడు ఆత్మకూరి కుమార్‌యాదవ్ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కోరారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో ఆదివారం కలిసి యాదవులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అనంతరం కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. యాదవులు గొర్రెల పాంలు ఏర్పాటు చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సబ్సిడీ అందేలా చూడాలని కోరినట్లు తెలిపారు. భారీ వర్షాల కారణంగా ఇటీవల మండలంలో గొర్రెలు, మేకలు మృత్యువాతపడి యాదవులకు తీవ్ర నష్టం జరిగిందని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో చర్చిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

నగదు అందజేత

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం ఇరిగేషన్ శాఖ డివిజన్ కార్యాలయం హెల్పర్ బండి మహేశ్ అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, దహనసంస్కారాల కోసం బాధిత కుటుంబ సభ్యులకు ఆ శాఖ ఏఈ రవికుమార్ ఆదివారం నగదు అందజేశారు. అంతకుముందు డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, రెవెన్యూ సిబ్బంది బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు.

అపరిచితులకు ఆశ్రయం ఇవ్వొద్దు



ఏటూరునాగారం: గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై తాజొద్దీన్



ఎస్ఎస్ తాడ్వాయి: గొత్తికోయల వివరాలను సేకరిస్తున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

ములుగు రూరల్: గ్రామాల్లో అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దని సీఐ శంకర్ అన్నారు. ఆదివారం మండలంలోని సర్వాపూర్ పంచాయతీ పరిధి జగ్గన్నగూడెం శివారులోని బోడరామయ్య గొత్తికోయగూడాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. గూడెంలోకి కొత్త వ్యక్తులు వస్తే ఆశ్రయం ఇవ్వకూడదని పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడే మావోయిస్టులకు సహకరించొద్దని తెలిపారు. కోతకు గురైన సర్వాపూర్-జగ్గన్నగూడెం గ్రామాల మధ్య బొగ్గువాగు లోలెవల్ బ్రిడ్జి మీదుగా వాహనాలు నడపరాదని సూచించారు. బొగ్గుల వాగు ఉధృతి కొంత మేర తగ్గినప్పటికీ వంతెన కింద నుంచి వరద ప్రమాదకరంగా ప్రవహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్‌రావు, డీఎస్ 58 సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఇనాందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏటూరునాగారం: మండల పరిధిలోని గొత్తికోయ గూడెల్లో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీ చేశారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో ఎస్సై తాజొద్దీన్ ఆధ్వర్యంలో పోలీసులు లింగాపురం గొత్తికోయగూడెంలో తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించి పంపించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు, అపరిచిత వ్యక్తులు సంచరించినట్లయితే తక్షణమే పోలీసులు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని అన్నారు. అనంతరం మండల కేంద్రంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఎస్సై రమేశ్, సీఆర్పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.



ములుగు రూరల్: మాట్లాడుతున్న సీఐ శంకర్, ఎస్సై వెంకటేశ్వర్‌రావు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని బయ్యక్కపేట అటవీ ప్రాంతంలోని సారలమ్మ గొత్తికోయగూడెంలో ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బందితో కలిసి ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి గొత్తికోయలతో మాట్లాడుతూ.. గూడెంలోకి కొత్త వ్యక్తులకు వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. పిల్లలను చదివించి మంచి ప్రయోజకులను చేయాలన్నారు. అలాగే బయ్యక్కపేట క్రాస్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు పూజారి రమేశ్, వెంకటేశ్వరావు, సాంబయ్య ఉన్నారు.

గోవిందరావుపేట: పస్రా పోలీస్ స్టేషన్ పరిధిలోని పందిరిదోన గొత్తికోయగూడెంను ఆదివారం పస్రా ఎస్సై కమలాకర్ సిబ్బందితో కలిసి సందర్శించారు. ఇటీవల తాడ్వాయి పరిధిలోని గుండాల ప్రాంతంలో పోలీస్ బలగాలకు, మావోయిస్టులకు జరిగిన ఎదురు కాల్పుల్లో తప్పించుకుపోయిన మావోయిస్టుల గాలింపు చర్యల్లో భాగంగా ఎస్సై కమలాకర్ పందిరిదోన గుత్తికోయగూడెంను సందర్శించారు. ఈ సందర్భంగా పస్రా ఎస్సై కమలాకర్ గిరిజన ప్రజలతో మాట్లాడుతూ.. ఎవరైనా కొత్త వ్యక్తులు గ్రామానికి వస్తే తమకు సమాచారం అందించాలని అన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పందిరిదోన గొత్తికోయగూడెం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



గోవిందరావుపేటలో..

వాహనాల తనిఖీ



తనిఖీ చేస్తున్న పోలీసులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని యాకన్నగూడెం గ్రామ శివారుల్లో ఆదివారం పోలీసులు ఎస్సై తిరుపతిరావు ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ నెల 28 నుంచి ఆగస్టు 3 వరకు మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తనిఖీలు చేపడుతున్నారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అనుమానిత వ్యక్తులు ఎవరైన తారస పడితే వారి వద్ద నుంచి పూర్తి స్థాయి సమాచారాన్ని సేకరించి పంపిస్తున్నారు. ఈ తనిఖీల్లో సీఆర్పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

మల్హర్: తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఉద్యమకారుల ఫోరం నాయకులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మండల కేంద్రం తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలోని మహాత్మ గాంధీ విగ్రహానికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు 250 గజాల స్థలంతో పాటు గుర్తింపు కార్డులు, పెన్షన్లు, హెల్త్, ఉచిత బస్సు పాస్ ఇవ్వాలన్నారు. అలాగే అమరవీరుల కుటుంబాలకు పెన్షన్లు, జార్ఖండ్ తరహాలో ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, క్యాబినెట్ మంత్రి వర్గం అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యమకారుల అంశంపై ప్రకటన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీయూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలోజు సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు బోయిన రాజయ్య, మండల అధ్యక్షుడు ముడుతనపల్లి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి బూడిద సతీష్, ఉపాధ్యక్షుడు చొప్పరి రాజు, సమ్మక్క, పార్వతి పాల్గొన్నారు.



గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యమకారులు

కురుమ సంఘం కమిటీ ఎన్నిక

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి కురుమ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఎన్నికల కో-ఆర్డినేటర్లు కోరె సుధాకర్, అమృత అశోక్ తెలిపారు. పట్టణ కేంద్రంలోని బీరప్ప గుడి ఆవరణలో ఆదివారం కురుమ సంఘం నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ వివరాలను వారు వెల్లడించారు. సంఘం భూపాలపల్లి పట్టణ అధ్యక్షుడిగా కోరె కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా అల్లి చేరాలు, ఉపాధ్యక్షులుగా కొముర‌య్య, రాంబాబు, కంకల మధు, కోశాధికారిగా కంచు రాజేందర్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. అలాగే సలహాదారులుగా బండి మల్లయ్య, నరిగే సమ్మయ్య, బుర్రి కుమారస్వామి, గుంటి గట్టయ్య, విరాముష్టి కొమురయ్య, సహాయ కార్యదర్శులుగా సప్ప కృష్ణమూర్తితో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు వివరించారు.

ఐలాపూర్‌కు రోడ్డు నిర్మించాలి

కన్నాయిగూడెం: ఎన్నో సంవత్సరాల నుంచి రోడ్డు సౌకర్యం లేక మండలంలోని ఐలాపూర్ గ్రామ ప్రజల ఇబ్బందులు పడుతున్నారని మండల ఆదివాసీ నాయకుడు ఆలం నాగేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఐలాపూర్ గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చిన రాజకీయ నాయకులు వచ్చి మాటలు చెప్పడం తప్ప చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం వచ్చిందంటే బాహ్య ప్రపంచానికి గ్రామానికి మధ్య సంబంధాలు పూర్తిగా తెగిపోతున్నాయన్నారు. గ్రామానికి కొండాయికి 12 కిలో మీటర్లు, సర్వాయికి ఐలాపూర్‌కు 11 కిలో మీటర్లు, రెడ్డిగూడేనికి 6కిలో మీటర్లు ఉంటుందని బీటీ రోడ్లు నిర్మిస్తే గ్రామస్తుల కష్టాలు తీరుతాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామానికి రోడ్డు మార్గం సుగుమం చేయాలని కోరారు.

వసతులు కల్పించాలి

ములుగు రూరల్: సంక్షేమ హాస్టళ్లల్లో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలని కులవ్యతిరేక పోరాట సమితి నాయకుడు జనున్న దేవేందర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టల్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. సంక్షేమ హాస్టల్‌లో పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకుంటున్నారని, వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. హాస్టల్ ఆవరణలో నీటి నిల్వలు ఉండడంతో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని అన్నారు. స్థానికంగా ఉండని వార్డెన్‌పై చర్య తీసుకోవాలని అన్నారు. విద్యార్థులకు దోమతెరలు పంపిణీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భిక్షపతి, రాజు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

వాజేడు: మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామస్తులకు ఆదివారం వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ చేతుల మీదుగా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. వర్షాలు, గోదావరి వరదల మూలంగా నిత్యావసర సరుకులకు ఇబ్బందులు తలెత్తాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ట్రాక్టర్ ద్వారా బొమ్మనపల్లి గ్రామానికి సరుకులను తరలించారు. గ్రామంలోని అన్ని కుటుంబాల వారికి నిత్యావసర సరుకులను అందించారు.



సరుకులు పంపిణీ చేస్తున్న పోలీసులు

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

ములుగు రూరల్: షరతులు లేకుండా రైతు రుణమాఫీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎండి గఫూర్‌పాషా అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలో కొర్ర రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం 2018 నుంచి 2023 వరకు రుణాలు పొందిన రైతుల్లో కొత్తమందికి రుణమాఫీ కాలేదని అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో రూ.72,659 కోట్లు వ్యవసాయరంగానికి కేటాయించడాన్ని హర్షిస్తున్నామని అన్నారు. వరి పంటకు బోనస్ ప్రకటించడంతో వరిసాగు పెరిగిందని అన్నారు. సన్నాలతో పాటు దొడ్డురకం వరికి బోనస్ ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రత్నం రాజేందర్, జన్ను దేవేందర్, ఎండి సద్దాంహుస్సేన్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గఫూర్‌పాషా

ఆర్థిక సాయం అందజేత

గోవిందరావుపేట: మండల పరిధిలోని పస్రా గ్రామ పంచాయతీ మొద్దులగూడెం గ్రామానికి చెందిన పిట్టల నర్సయ్య ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో బాధిత కుటుంబాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం మండల అధ్యక్షుడు మద్దినేని తేజరాజు ఆధ్వర్యంలో ఆదివారం పరామర్శించి ఆర్థిక సాయం, దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ.. నర్సయ్య కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రూ.25 లక్షలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొత్త సురేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగు రవీందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి శీలమంతుల రవీంద్ర చారి, కిసాన్ మోర్చా నాయకులు జినుకుల కృష్ణాకర్ రావు, జిల్లా ప్రచార కార్యదర్శి రుద్రారపు సురేష్, జిల్లా నాయకులు జాడి వెంకట్, కొత్త సుధాకర్, సత్య నారాయణ, బూత్ అధ్యక్షుడు కండ శ్రీను, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

ప్రమాదకరంగా ఉన్న చెట్ల తొలగింపు



ప్రొక్లెయినర్‌తో తొలగిస్తున్న చెట్లు

సాక్షి ఎఫెక్ట్..

ఏటూరునాగారం: మండలంలోని చిన్నబోయినపల్లి నుంచి ఏటూరునాగారం వరకు ప్రమాదకరంగా కూలిపోయే దశలో ఉన్న చెట్లను స్థానిక యూత్ సభ్యులు అధికారుల సహకారంతో ఆదివారం తొలగించారు. 'సాక్షి'లో ఈనెల 26న 'పొంచి ఉన్న ప్రమాదం' అనే శీర్షిక ప్రచురితం అయింది. అలాగే ఇటీవల చిన్నబోయినపల్లికి చెందిన జహంగీర్ అనే వ్యక్తిపై చెట్టు కూలి మృతి చెందాడు. దీంతో స్పందించిన స్థానిక ప్రజలు అధికారుల సాయంతో తొలగించారు. ఈ కార్యక్రమంలో వహిద్, గంపల శివ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనంపై నుంచి పడి వృద్ధురాలి మృతి

మంగపేట: మండలంలోని కత్తిగూడెం నుంచి తన కుమారుడి ద్విచక్రవాహనంపై కోమటిపల్లికి వెళ్తుండగా మార్గమధ్యలోని తిమ్మంపేట సమీపంలో ద్విచక్ర వాహనంపై నుంచి పడిపోయిన ఘటనలో వృద్ధురాలు టేకుమట్ల లక్ష్మి(80) శనివారం మృతి చెందినట్లు ఎస్సై టీవీఆర్ సూరి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలుకు ఇద్దరు కుమారులు ఉన్నారు.. పెద్ద కుమారుడు టేకుమట్ల నాగేశ్వర్‌రావు కత్తిగూడెంలో ఉంటుండగా చిన్న కుమారుడు నర్సయ్య కోమటిపల్లిలో ఉంటున్నారు. ఇద్దరు కుమారుల్లో ఒకరు మూడు మరొకరు మూడు నెలల చొప్పున తల్లి బాగోగులు చూసుకుంటున్నారు. పెద్ద కుమారుడి దగ్గర ఉన్న తల్లిని చిన్నకుమారుడు నర్సయ్య ద్విచక్ర వాహనంపై కోమటిపల్లికి తీసుకొస్తున్న క్రమంలో వాహనాన్ని అజాగ్రతగా నడపడంతో వృద్ధురాలు కండ్లు తిరిగి కింద పడిపోయింది. దీంతో తలకు బలమైన గాయంతో స్పృహతప్పింది. గాయపడిన వృద్ధురాలును 108లో ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలు పెద్దకుమారుడు నాగేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చినుకు పడితే చిత్తడే..



బురదమయంగా మారిన రోడ్డు

గోవిందరావుపేట: చినుకు పడితే పస్రా గ్రామంలోని మట్టి రోడ్లు మొత్తం బురదమయంగా మారిపోతున్నాయి. పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సమ్మక్క సారలమ్మ వాటర్ ప్లాంట్ పక్కన ఉన్న రహదారిపై అడుగడుగునా గుంతలు పడి బురదమయమై కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు గుండా నిత్యం కాలనీ వాసులు, రాంపూర్ పొలాలకు రైతులు ట్రాక్టర్లు తీసుకుపోతుంటారు. రోడ్డు అధ్వానంగా ఉండి ప్రయాణం నరకంగా మారింది. అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడం వల్ల రోడ్డు పరిస్థితి మారడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పలిమెల: మొక్క నాటుతున్న ఫారెస్ట్ అధికారులు



మొగుళ్లపల్లిలో..



కాటారంలో..

కాటారం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా భావించి విరివిగా మొక్కలు నాటాలని కాటారం డిప్యూటీ రేంజ్ అధికారి సురేందర్ అన్నారు. వన మహోత్సవం, ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మొక్కలు జీవకోటి మనగడకు లబ్ధి చేకూరుస్తాయన్నారు. చెట్లు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో దామెరకుంట, చింతకాని ఫారెస్ట్ సెక్షన్ అధికారులు చంద్రశేఖర్, సుమన్, అర్చన, ఎఫ్‌బీఓలు అశోక్, మోయినోద్దీన్, రాజ్‌కుమార్, బేస్ క్యాంప్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మొక్కలు నాటి పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నాగరాజు అన్నారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో ఎంజేపీ పాఠశాల ఆవరణలో ఫారెస్ట్ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఫారెస్ట్ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శి, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ శాఖ బీట్ ఆఫీసర్ విజయ, జీపీ సెక్రటరీ నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మహాముత్తారం: కేజీబీవీ పాఠశాలలో మొక్క నాటుతున్న అధికారులు

చెట్లతోనే వాతావరణ సమతుల్యత

పలిమెల: చెట్లతోనే వాతావరణం సమతూల్యంగా ఉంటుందని పలిమెల రేంజ్ ఆఫీసర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని పంకెనలోని కస్తూరిబా పాఠశాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. మొక్కల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు రాజేందర్, ఎస్‌డీ ఆఫ్జల్, కృష్ణ, వినోద్, బీట్ ఆఫీసర్లు, వాచర్లు తదిరులు పాల్గొన్నారు.

మహాముత్తారం: ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా అటవీశాఖ అధికారులు పెగడపల్లి ఆశ్రమ పాఠశాలతోపాటు మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెగడపల్లి డీఆర్‌ఓ రమేశ్, హుస్సేన్, ఎఫ్ఎస్ఓ రమేశ్, సంతోష్, ఆజంనగర్ అటవీ క్షేత్రాధికారి సత్యనారాయణ, సెక్షన్ ఆఫీసర్ సాంబయ్య, రజిత, బీట్ అధికారులు మంజుల, ప్రతిబాబు, అనిల్, శ్రీనివాస్, మోడల్ స్కూల్ ఇన్‌చార్జ్ ప్రిన్స్‌పాల్ చైతన్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఫాగింగ్ చేయరా సారూ?

మంగపేట: గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయరా సారూ అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో ఒకటి రెండు గ్రామాల్లో తప్ప ఏ గ్రామ పంచాయతీలో కూడా దోమల నివారణకు ఫాగింగ్ చేయలేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా దోమల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఫాగింగ్ మిషన్లు ఉన్నా వాటిని వినియోగించక పోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండకుండా నామమాత్రంగా విధులకు హాజరవుతూ పంచాయతీల పాలనను సిబ్బందికి వదిలేసి వెళ్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో పారిశుద్ధ్యం పేరుకుపోయి దోమలు పెరిగి జ్వరాలతో వస్తున్నాయని వాపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్, పారిశుద్ధ్య పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.